

పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలో పర్యాటక ప్రదేశాలైన చాపరాయి జలపాతం, అరకు పైనారిలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు పోటెత్తడంతో కిటకిటలాడింది. చాపరాయి జలపాతంలో అధిక సంఖ్యలో పర్యాటకులు రావడంతో వాహనాల రద్దీ ఏర్పడింది. పర్యాటకులు జలపాతంలో జారుతూ స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. దింసా నృత్య బృందంతో కలిసి నృత్యాన్ని ప్రదర్శిస్తూ పర్యాటకులు అనుభూతిని పొందారు. కుటుంబ సమేతంగా వనభోజనాలు చేస్తూ ఆనందంగా గడిపారు. తెల్లవార్లు కురిసిన పొగ మంచు అందల్లో ద్విచక్ర వాహనాల్లో సరదాగా ప్రయాణిస్తూ సందడి చేశారు.



తరలివచ్చిన పర్యాటకులు

గిరిజనుల గుండెచప్పుడు సిపిఎం

- ★ పోలవరం నిర్వాసితుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు
- ★ ఆదివాసీ హక్కులు, చట్టాల రక్షణకు నిరంతర కృషి
- ★ పోడు పట్టాలు, మౌలిక వసతులు కోసం అనేక ఉద్యమాలు
- ★ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు వర్గాలకు అండ

ప్రజాశక్తి - రంపచోడవరం

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు... గిరిజనుల గుండెచప్పుడు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై తొలి నుండి సిపిఎం అలుపెరగని పోరాటాలు చేస్తోంది. ఆదివాసీల హక్కులు, చట్టాల రక్షణకు నిరంతరం ఉద్యమిస్తోంది. పోడు పట్టాలు మంజూరు చేయాలని, రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పించాలని అనేక పోరాటాలు చేసింది. జిఒ నెంబర్ 3ను పునరుద్ధరణ కోసం, బోయి వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ కూలీల సమస్యలపైనా సిపిఎం సమరశీల ఉద్యమాలు చేపట్టింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు వర్గాలకు ఎల్లప్పుడు అండగా నిలుస్తోంది.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై...

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు తొలి నుండి అన్యాయం జరుగుతోంది. ప్రాజెక్టు నిర్మాణంపై ఉన్న శ్రద్ధ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నది స్పష్టమవుతోంది. ఈ 20 ఏళ్లలో ప్రాజెక్టు నిర్మాణం 75 శాతం పూర్తికాగా పునరావాస కల్పన 10 శాతం కూడా మించలేదని నిర్వాసితులు చెబుతున్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పనలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయి. పోలవరం నిర్వాసితుల సమస్యలపై మొదటి నుండి సిపిఎం ఉద్యమిస్తోంది. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించిన తరువాతే ప్రాజెక్టు నిర్మాణం చేయాలని అనేక పోరాటాలు చేయగా, ప్రభుత్వాలు సిపిఎం నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయినా సిపిఎం ఎక్కడా వెనుకడుగు వేయలేదు. నిర్వాసితులకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, బివి.రాఘవులు వంటి నాయకులు అండగా నిలిచారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో నిర్వాసిత ప్రాంతాలను కలుపుకొని ఏకంగా విజయవాడ వరకు పాదయాత్ర చేపట్టి నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలుగెత్తి చాటారు. ఈ సమస్యలపై క్షేత్రస్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ సిపిఎం ఉద్యమించింది. పోలవరం నిర్వాసితులకు అండగా నిలిచిన ఏకైక పార్టీ సిపిఎం అనేది సుస్పష్టం.

పోడు భూములకు పట్టాలు కోసం..

గిరిజన ప్రాంతంలో పోడు భూములను ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న అర్హులైన వారికి కొండపోడు పట్టాలు ఇవ్వాలని సిపిఎం ఉద్యమించింది. అటవీ హక్కుల చట్టాన్ని సాధించింది. కొండపోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు వేధింపులపై కూడా సిపిఎం అలుపెరగని పోరాటాలు నేటికీ చేస్తోంది.

జీవో నెంబర్ 3 పునరుద్ధరణ కోసం..

ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీ గిరిజనులకే కేటాయించే జిఒ నెంబర్ 3ను సుప్రీం కోర్టు రద్దు చేయడంతో ఇక్కడ గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. రద్దు చేసిన ఈ జిఒను పునరుద్ధరించాలని సిపిఎం అనేక పోరాటాలు చేసింది. ఆదివాసీ గిరిజన నిరుద్యోగులకు జరిగే అన్యాయంపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ జీవో నెంబర్ 3 విశిష్టతను వారికి తెలియజేసి వారిని పోరాటాల్లోకి దింపే ప్రయత్నం చేసింది.

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై

రాజకీయ ప్రయోజనాల కోసం మైదాన ప్రాంతాలకు చెందిన బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించింది. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితలో చేర్చడం వల్ల గిరిజన ప్రాంతాల్లో నివసించే అమాయక గిరిజనులకు ఆర్థికంగా, రాజకీయంగా కలగనున్న నష్టాలపై వారికి అవగాహన కల్పించి ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఉద్యమాలు చేసింది.

గిట్టుబాటు ధరల కోసం

గిరిజన ప్రాంతాల్లో తూనికాకుతో పాటు ఇతర అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం పోరాటాలు చేసింది.

ఉద్యోగ, కార్మిక సమస్యలపై

గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఐటిడిఎ, ఆశ్రమ, గురుకుల హాస్టళ్లలో పని చేసే కార్మికులు, స్కీమ్ వర్కర్లు, తునికాకు కార్మికులు, తాగునీటి పథకం కార్మికుల సమస్యలపైనా, ఉపాధి హామీ కూలీలకు బకాయిలు, ఇతర సమస్యలపై సిపిఎం ఉద్యమించింది. ఇలా ప్రజలలో ఉంటూ ప్రజల కోసం నిత్యం పోరాటాలు జరిపే సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభ ఈ నెల 16, 17 తేదీల్లో రంపచోడవరంలో జరుగుతోంది.



పోలవరం నిర్వాసితుల సమస్యలపై పాదయాత్ర చేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు (ఫైల్‌ఫోటో)

నేటి నుండి సిపిఎం జిల్లా మహాసభ

- రెండు రోజులపాటు నిర్వహణ
- ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరు
- పెద్ద ఎత్తున తరలిరానున్న కార్యకర్తలు, అభిమానులు

ప్రజాశక్తి రంపచోడవరం

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభ రంపచోడవరం కేంద్రంగా ఈ నెల 16, 17 తేదీల్లో జరగనుంది. ఈ మహాసభకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, కిల్లో సురేంద్ర ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. మహాసభను పురస్కరించుకొని 16న సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక సిపిఎం కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్, దేవిగుడి సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు. అనంతరం స్థానిక రంప రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు ప్రసంగించనున్నారు. అనంతరం స్థానిక ఆర్పీ ఫంక్షన్ హాల్‌లోని పూనెం సత్యనారాయణ నగర్, సీతారాం ఏచూరి ప్రాంగణంలో మహాసభ ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. 17వ తేదీ సాయంత్రం జరగనుంది.



ఈ మహాసభలో ఈ కాలంలో సిపిఎం చేసిన కృషిని సమీక్షించి, రానున్న కాలంలో చేపట్టబోయే పోరాటాలకు దిశా నిర్దేశం చేయనున్నారు. బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుండి భారీ ఎత్తున సిపిఎం, కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని ఆ పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు.



గ్రామీణ వైద్యుడిని సన్మానిస్తున్న వైద్యులు

గ్రామీణ వైద్యుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-చింతపల్లి:గ్రామాలలో గ్రామీణ వైద్యులు అందిస్తున్న సేవలు అభినందనీయమని బేసిక్ హెల్త్ కేర్ మెడికల్ ప్రాక్టీషనర్‌ల అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొప్పన రామారావు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం బేసిక్ హెల్త్ కేర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర పదేశ్ పేరిట ఉమ్మడి విశాఖ జిల్లా సమావేశం ఆ అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు బొప్పన లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సీపట్నం శ్రీహర్ష ఎమర్జెన్సీ కేర్ ఆసుపత్రి వైద్యులు శ్రీ హర్ష ఆకెళ్ళ, గైనకాలజిస్ట్ శారదా దేవిలు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లలేని ఎంతోమంది నిరుపేదలకు గ్రామీణ వైద్యులు అందుబాటులో ఉంటూ అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. గ్రామీణ వైద్యులందరినీ అభినందించుకోవడం సంతోషకరంగా ఉందని ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు బొప్పన లక్ష్మణరావు అన్నారు. గ్రామీణ వైద్యుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని, వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, నర్సీపట్నం డివిజన్‌ల అధ్యక్షులు రాజేశ్వరరావు, అచ్చియ్య నాయుడు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు చింతపల్లి, జీకే వీధి, జీ మాడుగుల మండల అధ్యక్షులు రమణ, జయ కుమార్, కాసులమ్మ, అల్లూరి జిల్లా మహిళా కన్వీనర్ బి హెచ్ హైమావతి, తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ మోహన్‌రావు, కోటనందూరు మండల అధ్యక్షుడు కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు కె రమణ పాల్గొన్నారు.



రగ్గులు పంపిణీ చేస్తున నాయకులు

గిరిజనులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని గుంటసీమ పంచాయతీ సరియవలస గ్రామంలోని సుమారు 50 మంది గిరిజనులకు ఆదివాసి గిరిజన సంఘం, శారద ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, నిరుపేద గిరిజనులకు ఇటువంటి సేవలను శారద ట్రస్ట్ అందించడం ఎంతో ఆనందదాయకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ, మండల అధ్యక్షుడు పి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, నాయకులు తిలక్, టి.రామదాస్, కే.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



సీలేరులో దట్టంగా కురుస్తున్న మంచు

పెరిగిన చలి తీవ్రత

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతుండగా, చలి తీవ్రత అధికమవుతుంది. శనివారంతో పోల్చితే ఆదివారం మంచు తీవ్రత కాస్త తక్కువగా ఉన్నా చలిగాలులు అధికంగా వీస్తూ చలి తీవ్రత మరింత పెరిగిపోయింది. ఆదివారం ఉదయం ఏడు గంటలకు 12 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కాగా 9 గంటలకు 15 డిగ్రీలు, మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి 30 డిగ్రీలకు చేరుకుంది. అయినప్పటికీ చలి తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. మధ్యాహ్నం రెండు గంటల తరువాత ఉష్ణోగ్రతలు తగ్గి, వాతావరణంలో తేమ శాతం క్రమేపి పెరుగుతూ శీతలంగా మారింది. మధ్యాహ్నం మూడు గంటలకు 25 డిగ్రీలకు నమోదు కాగా, సాయంత్రం ఆరు గంటల తర్వాత ఉష్ణోగ్రతలు పూర్తిస్థాయిలో పడిపోయి చలి ఒక్కసారిగా అధికమైంది. దీంతో ప్రజల బయటకు రావడానికి సాహసించడం లేదు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు సీలేరు నది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు చలికి తాళలేక తెల్లవారుజామున, రాత్రి సమయంలో చలి మంటలు వేసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. దినసరి కూలీలు చలి తీవ్రతకి తట్టుకోలేక పనులకు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. దీర్ఘకాలిక రోగులు చలికారణంగా అనేక ఇబ్బందులు గురవుతున్నారు.

గిరిజనులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని సూరకుంట గ్రామంలో 125 కుటుంబాలకు సమరిటన్స్ ఫర్ ది నేషన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సర్పంచ్ పాయం చంద్రయ్య, గ్రామ పటేల్ తోడం చంద్రయ్య చేతుల మీదుగా రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమరిటన్స్ ఫర్ ద నేషన్ ఆర్గనైజేషన్ డైరక్టర్ రాంకుమార్ మాట్లాడుతూ అటవీ ప్రాంతం కావడంతో విపరీతమైన చలి వుండడం వల్ల ఏడుగురాళ్ళపల్లి, పేగ పంచాయతీ పరిధిలో 18 గ్రామాల్లోని 1600 కుటుంబాలకు రగ్గులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసం పొద్దయ్య, తోడం సుబ్బరాజు, రాఘవ గోరం, సోడే శ్రీను, నూప కోటేష్, నూప తిరుపతమ్మ, తోడం తిరుపతమ్మ, నూప జోగమ్మ తదితరులు పాల్గొన్నారు.



రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

శిథిలావస్థలో పశు వైద్య కేంద్రం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:ఏళ్లు గడుస్తున్నా స్థానిక పశువైద్య కేంద్రానికి సొంత భవనం లేక పరాయి పంచన పూర్తిగా శిథిలావస్థలో ఉన్న ఆర్ అండ్ బికి చెందిన భవనంలో నిర్వహణ కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులకు విన్నవించినా భవన నిర్మాణంకు నిధులు, స్థలం మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుండడంతో శిథిల భవనంలోనే సిబ్బంది పలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం పూర్తిగా శిథిలావస్థలో చేరి కూలిపోయే పరిస్థితిలో ఉంది. ఈ భవనం 30 ఏళ్ల క్రితం నిర్మించడంతో ప్రస్తుతం ఆ భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉంది. ఈ భవన గోడలు పగిలి, బీటలు బారి ఉండగా, పైకప్పు రేకులు పగిలి పోయి రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో వర్షాలు పడినప్పుడు వర్షపు నీరు భవనం లోపల కారి పోతుండటంతో లోపల నున్న ఫర్నిచర్ తో పాటు మూగ జీవాలకు వైద్యం అందించే మందులు పూర్తిగా తడిసి పోతున్నాయి.సుమారు గత 20ఏళ్ల నుంచి పశు వైద్య కేంద్రం ఈ భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. కానీ ఇప్పటికీ సొంత భవనం ప్రభుత్వం మంజూరు చేయలేదు. దీంతో తప్పని పరిస్థితిలో పరాయి పంచన నిర్వహణ సాగిస్తూ వర్షాకాలంలో పలు ఇబ్బందులు పడుతున్నామని స్థానిక వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మండలంలోని 18 పంచాయతీల నుంచి గిరి రైతులు ఈ పశు వైద్య కేంద్రానికి వచ్చి మూగ జీవులకు వైద్య సేవలు చేయించుకుంటున్నారు. ఇప్పటివరకు సొంత భవనం లేకపోవడంతో వర్షానికి కారిపోయి తడిసి పోతుండటంతో ప్రభుత్వం పంపిణీ చేసిన వైద్య సామగ్రి భవనం లోపల ఉంచడానికి ఇబ్బందులు పడుతున్నారు.

సొంత భవనం నిర్మాణం కు పలుమార్లు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ మంజూరు కాలేదని అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పశు వైద్య కేంద్రానికి సొంత భవనం నిర్మించాలని మండలంలోని పలువురు రైతులు కోరుతున్నారు.




శిథిలావస్థలో ఉన్న పశువైద్య కేంద్రం

పోలవరం నిర్వాసితుల

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి -పాడేరు: పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయం నుండి చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోని అధికారులతో పోలవరం నిర్వాసితుల సమస్యలు, సదుపాయాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టులో భూములు, ఇల్లు కోల్పోయిన వారి వివరాలపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సమగ్రమైన సర్వే నిర్వహించాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయ భూముల కేటాయింపు, వాటిపై వచ్చిన ఫిర్యాదులు, ఆర్‌ఆర్ కాలనీలలో సదుపాయాలు, వచ్చిన ఫిర్యాదులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టుపై వారం వారం సమీక్షిస్తామని పేర్కొన్నారు. బాధితుల వివరాలు, సమస్యలు సేకరించి సమగ్రమైన నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, చింతూరు, , రంపచోడవరం పిఒలు, రంప చోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ పాల్గొన్నారు.

కలెక్టర్ దినేష్ కుమార్



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



అకులోయలో నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

షేక్ సాబ్జికి ఘన నివాళి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘ భవనంలో పిడిప్ మాజీ ఎమ్మెల్సీ స్వర్గీయ షేక్ సాబ్జి మొదటి వర్ధంతి సందర్భంగా ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఘనంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి మహేశ్వరరావు మాట్లాడుతూ గతంలో షేక్ సాబ్జి అనేక ఉద్యమాలకు సారథ్యం వహిస్తూ సమస్యలు పరిష్కారంలో విశేషమైన కషి చేశారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సిపిఎస్ రద్దు చేయాలని అనంతగిరి నుండి ప్రారంభమైన బైక్ జాత కార్యక్రమంలో పాల్గొని 2050 కిలోమీటర్లు ప్రయాణం చేసి విజయవాడ చేరుకున్నారని సమస్యలపై గళం ఇవ్వాలని గుర్తు చేశారు.ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కోసం యుటిఎఫ్ నిరంతరం కషి చేస్తుందని చెప్పారు. ఆయన ఆశయాలు సాధన కోసం నిరంతరం కషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు టి చిట్టిబాబు, కార్యదర్శి పి దేముడు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ నారాయణ,ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ సభ్యులు కె రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి:మండల కేంద్రంలో పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి మండల యూటిఎఫ్ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆడుగు జాడలో నడిచి ఆశలు నెరవేరుస్తామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా యూటిఎఫ్ పూర్వసహాధ్యక్షులు శెట్టి రాంబాబు మాట్లాడుతూ, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పై షేక్ సాబ్జి నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు.గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సమస్యల కోసం యుటిఎఫ్ తలపెట్టిన జీపు జాతాలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బి.సింహచలం, ఎన్,మల్లేశ్వరరావు, రఘు, రామారావు, పరమేశ్వరరావు, సుధారాణి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరిలో నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి


పాడేరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

ప్రజాశక్తి-పాడేరు: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గ శాసన సభ్యులు, అల్లూరి జిల్లా వైసిపి అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో పూలమాల వేసి నివాళి అర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలను అర్పించారన్నారు.ఆయన చేసిన త్యాగం మనకు ప్రేరణ ఇస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమం లో వైఎస్ఆర్ పార్టీ పాడేరు మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఎస్టి సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కిల్లో కోటిబాబు నాయుడు, కూడ సురేష్ కుమార్, మాజీ సర్పంచ్ పాంగి నాగరాజు, మినుముల కన్నా పాత్రుడు,

పాడేరు: జిల్లా కలెక్టర్ కార్యాల సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ ఘనంగా నివాళి అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువ లేనిదన్నారు.ఐటీడీఏ కార్యాలయంలో పరిపాలనాధికారి ఎం.హేమలత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాడేరు తహసిల్దార్ వంజంగి త్రినాధరావు నాయుడు, పరిపాలన అధికారి నాగరాజు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం: ఆంధ్ర రాష్ట్రం కోసం అమరుడైన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం స్థానిక ఐటిడిఏ కార్యాలయ సమావేశపు హాలులో ఆదివారం ఘనంగా జరిగింది. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలంతో పాటు అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగా కర్నూల్ రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, పిహెచ్ఓ చిట్టిబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు చైతన్య, నాగరాజు, సీనియర్ అసిస్టెంట్లు బి.రాజు, శ్రీకాంత్, పి.భీమిరెడ్డి, దయానంద్, విల్సన్, గ్యాస్ మేనేజర్ చిన్నబ్బాయి, బి.మార్గదర్శి, కె.పండు దొర, సిహెచ్ సోమిరెడ్డి, పి.లక్ష్మిరెడ్డి, తాతారావు, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బంధం శ్రీదేవి, జెడ్‌పిటిసి సభ్యులు పండా వెంకట లక్ష్మి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుండం శ్రీనివాస్‌దొర, కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పి.జయంతి, పంచాయతీ ఇఒ పద్మజ, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


రంపచోడవరం ఐటిడిఎలో నివాళులర్పిస్తున్న పిఒ తదితరులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

చింతూరు : చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తెలుగు అధ్యాపకరాలు కె.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, అధ్యాపకుడు బి.శ్రీనివాసరావు, ఆర్‌సిహెస్.నాగేశ్వరరావు, జి.హరతి, కె.లక్ష్మి, కె.శకుంతల, జి.సాయికుమార్, యన్.రమేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



చింతూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

నేరాలు ఘోరాలు


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

100కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- పెదబయలు :పెదబయలు ఎస్ఐ కొల్లి రమణకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు పెదబయలు మండలం అడుగులు పుట్టు పంచాయితీ సంపంగి పుట్టు జంక్షన్ పోలీస్‌లు వాహనములు తనిఖీ చేస్తుండగా 100కిలోల గంజాయి పట్టుబడింది. ఒడిస్సాలోని కోరాపుట్ బైలగుడ వైపుగా గంజాయిని కార్‌లో ఇద్దరు వ్యక్తులు సుమారు 100 కేజీల తరలిస్తూ పట్టుబడ్డారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని తెలిపారు


సోలార్ పరికరాలు అందిస్తున్న ఇఎఎస్ శర్మ

సోలార్ విద్యుత్ పరికరాలు అందజేత

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ చిన్న కోనల, బూరిగ, మంగళ గుడ్డే గ్రామాల గిరిజనులకు మాజీ ట్రైబల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇఎఎస్.శర్మ తన సొంత డబ్బులతో సోలార్ వీధి పరికరాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ, విద్యుత్ సౌకర్యం లేక గిరిజనులు రాత్రుల సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ ఉద్దేశంతో తన సొంత డబ్బులు ఖర్చు సోలార్ విద్యుత్ దీపాలు అందజేయడం జరిగిందన్నారు. వీటిని గిరిజన ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు ఈ సోలార్ పరికరాలను స్థానిక వార్డు మెంబర్ సోమ్మెల. అప్పలరాజు, గ్రామస్తులు బి.పెంటయ్య, జన్ని శంకరరావులకు అందజేశారు.

విజయవంతంగా వైజాగ్ మారథాన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇండియన్ నేవీ ఆధ్వర్యాన 12 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వైజాగ్ నేవీ మారథాన్ 9వ ఎడిషన్ ఆదివారం ఉదయం విశాఖపట్నం బీచ్ రోడ్‌లో విజయవంతంగా జరిపారు. వివిధ కేటగిరీలలో సుమారు 12 వేల మంది రన్నర్లు పాల్గొన్నారు. ఈ మారథాన్ మొత్తం నాలుగు విభాగాల్లో నిర్వహించగా 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్, 21.1 కిలోమీటర్ల హాఫ్ మరథాన్‌లను బీచ్ రోడ్‌లోని విశ్వ ప్రియ ఫంక్షన్ హాల్ వద్ద తూర్పు నావికా దళ విభాగాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ జెండా ఊపి ప్రారంభించారు. 10 కిలోమీటర్ల రన్‌ను విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, 5 కిలోమీటర్ల రన్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత భాగ్చి ప్రారంభించారు.

ఈ సందర్భంగా తుర్పునవికా దళ విభాగాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పంధార్కర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం లో పాల్గొని విజయవంతం చేసిన విశాఖ ప్రజలకు, సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం వల్ల విశాఖపట్నం టూరిజం ఫెసిలిటీస్, సముద్రతీరం, గురించి తెలియజెప్పే అవకాశం ఏర్పడుతుందన్నారు.

అనారోగ్య బాధితురాలికి హెల్త్ కార్డు అందజేత

ప్రజాశక్తి - చింతపల్లి : కడుపులో కణితితో బాధపడుతున్న మహిళకు కార్పొరేట్ వైద్యం నిమిత్తం ఆదివాసి ట్రస్ట్ హెల్త్ కార్డు ఇచ్చి అండగా నిలవడం జరిగిందని ఆదివాసి ట్రస్ట్ చైర్మన్ కె.బీ పడాల్ అన్నారు. మండలంలోని అంతర్లలోని ట్రస్టు కార్యాలయంలో ఆదివారం ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీకే వీధి మండలం కోరాపల్లి గ్రామానికి చెందిన బొడ్నాయిక్ సోమరి కొంతకాలంగా కడుపులో కణితితో అనారోగ్యంతో బాధపడుతూ తనను కలవడంతో ఆ బాధితురాలికి 'ట్రస్ట్ హెల్త్ కార్డు" ఇచ్చామన్నారు.కణితి శస్త్ర చికిత్సకు విశాఖలోని కార్పొరేట్ ఆసుపత్రికి పంపించడం జరిగిందన్నారు.



హెల్త్‌కార్డును అందిస్తున్న పడాల్

చెరువుల మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి- చింతపల్లి:సాగు నీటి సంఘాల ఎన్నికలకు స్వాగతిస్తున్నామని, అదే సందర్భంలో సాగునీటి చెరువుల మరమ్మత్తుల నిమిత్తం వచ్చిన నిధులను ఖర్చు చేయాలని లేకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ హెచ్చరించారు. ఆదివారం చింతపల్లిలో రైతులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంటలు పండినా కొనుగోలు కేంద్రాలు ఇప్పటికి ఏర్పాటు చేయలేక పోవడంతో దళారీలకు అమ్ముతున్నారన్నారు. ఒక్కొక్క రకం దాన్యం ఒక్కొక్క రేటు ఉందన్నారు. అనేక రిజర్వాయర్లకు లక్షల రూపాయలు వచ్చినప్పటికీ ఆయకట్టు రైతులకు నీరు అందక గడిచిన 15 సంవత్సరాల నుంచి గిరిజన రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు మజ్జి రాంబాబు పాల్గొన్నారు.

చిల్లర నాణేల పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వినియోగదారులు, వర్తకులు చిల్లర నాణేల కొరతను ఎదుర్కొంటున్న నేపథ్యంలో కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ సీతమ్మధార బ్రాంచ్ అధికారులు ఆదివారం సీతమ్మధార రైతు బజారులో చిల్లర నాణేల పంపిణీ చేపట్టారు. బ్యాంకు సామాజిక కార్యక్రమంలో భాగంగా వినియోగదారులకు, వ్యాపారులకు రూ.ఒక రూపాయి నుంచి రూ. 20 విలువ కలిగిన నాణేలు, నోట్లును రూ.3.50 లక్షలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీతమ్మధార బ్రాంచ్ మేనేజర్, రైతు బజార్ ఎస్టేట్ అధికారి, అధికారులు పాల్గొన్నారు.

మనసు దోచిన సుమధుర గీతాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం రాత్రి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావారి ఆద్యంతం అలరించింది. ముఖ్య అతిథిగా నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పైడా విద్యాసంస్థలు అధినేత కృష్ణప్రసాద్, మాజీ పోలీసు అధికారి మహ్మద్ ఖాన్, కొణతాల రాజు తదితరులు హాజరయ్యారు. గాయకులు భాగ్యలక్ష్మి, మాధవి, సూర్య ప్రకాష్, వాసంతి, సాను, రామనీ, వీరేంద్ర యాదవ్, బంగార్రాజు, ప్రకాష్ రాంనరసింహం ప్రజాదరణ పొందిన ఘంటశాల గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా అతిథులను విశాఖ సకల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, వివిధ కళా సంస్థల అధినేతలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రతినిధులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

పాయం సీతమ్మకు ఘన నివాళి


పాయం సీతమ్మకు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-కూనవరం : జెడ్‌పిటిసి మాజీ సభ్యులు అమరజీవి కామ్రేడ్ పాయం సీతమ్మకు సిపిఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని పెద్దార్కూర్ గ్రామంలో సీతమ్మ 14వ వర్ధంతి కార్యక్రమం పాయం సీతారామయ్య అధ్యక్షన ఆదివారం జరిగింది. గ్రామంలోని సీతమ్మ స్థూపం వద్ద ఆమె చిత్ర పటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, ఇతర నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల కూలీల రేట్లు, తునికాకుల రేట్లు సమస్యలపైనా, అటవీ హక్కు పత్రాల కోసం జరిగిన పోరాటాల్లో సీతమ్మ చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై ఆమె ఉద్యమించారన్నారు. జెడ్పిటిసిగా ఉన్నప్పుడు కూనవరం మండలం అభివృద్ధిపై జెడ్పీ చైర్మన్ నిలదీసి నిధులు రాబట్టి, మారుమూల గ్రామాలకు రోడ్లు, మంచినీరు, సాగునీటి వనరుల కల్పనకు కృషి చేశారని గుర్తు చేశారు. శబరి పరివాహక ప్రాంతాల్లో లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు చేయించే దాంట్లో ఆమె కృషి మరువలేమన్నారు. పోలవరం నిర్వాసితుల పక్షాల నిలబడి పోలీసులతో లాఠీ దెబ్బలు తిన్నారన్నారు. ఆమె అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా సమస్యలపై పోరాటంలో ముందుండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, తాళ్ళూరి శ్రీనివాసరావు, మాడెం బాబు, పాయం సత్యనారాయణ, పాయం రాజయ్య, శాఖ కార్యదర్శులు మడకం సత్యనారాయణ, పాయం వెంకటయ్య పాల్గొన్నారు.

గాజువాకలో ఇండోర్ కబడ్డీ స్టేడియం

- ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలో కబడ్డీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గాజువాక టిడిపి కార్యాలయంలో పల్లాను ఆంధ్ర రాష్ట్ర, జిల్లా కబడ్డీ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కబడ్డీ పురోభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడతానన్నారు. అసోసియేషన్ల మధ్య విబేధాలను పరిష్కరిస్తానని, గతంలో గుంతకల్లులో జరిగిన అసోసియేషన్ రిజిస్ట్రేషన్‌పై విచారణ జరిపించి, నిజమైన క్రీడాసంఘానికి న్యాయం చేస్తానన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉరుకూటి శ్రీనివాసరావు, గాజువాక నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రసాదుల శ్రీనివాసరావు, ఉరుకూటి బాబురావు, సిహెచ్‌ఎన్. మూర్తి, పల్లా రమణ, పల్లా బాబూరావు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే సినిమా తీస్తా

ప్రజాశక్తి -గాజువాక : సమాజానికి ఉపయోగపడే సినిమా తీస్తున్నట్లు, ఫిలిం డైరెక్టర్ బి జగదీష్ అన్నారు. ఆదివారం గాజువాకలో విలేకరులతో మాట్లాడుతూ, 'మిస్సింగ్ చైల్డ్' పేరుతో కథ రాశానని, రాధాకృష్ణ బ్యానర్‌పైన సినిమా చేస్తున్నట్లు తెలిపారు. తాను పూరి జగన్నాథం, యండమూరి వీరేంద్రనాథ్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. న్నదని తెలిపారు. త్వరలో షూటింగ్ ప్రారంభించి, విశాఖ, హైదరాబాద్, భోపాల్‌లలో పలు లొకేషన్లలో చిత్రీకరణ పూర్తిచేసి, వచ్చే నవంబర్‌లో సినిమా విడుదల చేస్తామన్నారు. నిర్మాత జి సురూపరాణి మాట్లాడుతూ, విశాఖపట్నంలో ఉన్న కళాకారులను ఆదుకోవాలని ఉద్దేశంతో తక్కువ బడ్జెట్‌తో తీసే సినిమాను విశాఖ నుంచే మొదలుపెడతానన్నారు. సమావేశంలో పెనుమత్స శ్రీనివాసరాజు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-విఆర్.పురం :రంపచోడవరంలో ఈ నెల 16, 17 తేదీలలో జరుగు సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని రేఖపల్లి బొప్పెన భీమయ్య భవనంలో ఆదివారం పార్టీ నాయకులు పంకు సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం లేదని, వెంటనే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు మోపే విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు సోయం చినబాబు, సున్నం రాజులు, కారం సుందరయ్య, మండల నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, పూనెం ప్రదీప్ కుమార్, తోడం రాజు, తుర్రం బాబురావు, కారం సత్తిబాబు, వడ్లాది రమేష్, కదల కొండారెడ్డి, గుండిపుడి లక్ష్మణరావు, కమ్మచిచ్చు సత్యనారాయణ, జల్లి సత్యనారాయణ, శ్రీరపు తాతబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నేత పులి సంతోష్‌కుమార్

నిద్రలో కృత్రిమ దంతాల సెట్‌ను మింగిన వ్యక్తి

రిజిడ్ బ్రాంకోస్కోపీతో తీసిన కిమ్స్ ఐకాన్ పల్మనాలజిస్టులు

ప్రజాశక్తి -గాజువాక : కృత్రిమ దంతాల సెట్‌ను నిద్రలోనే మింగి అస్వస్థతకు గురైన వ్యక్తికి కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి పల్మనాలజిస్టులు వైద్యం చేసి ప్రాణాలను కాపాడారు. రిజిడ్ బ్రాంకోస్కోపీ అనే పరికరంతో కుడి ఊపిరితిత్తుల్లో ఇరుక్కున్న పళ్ల సెట్‌ను తీశారు. దీనికి సంబంధించి కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ సిహెచ్ భరత్ తెలిపిన వివరాలివి.

విశాఖపట్నానికి చెందిన 52 ఏళ్ల ఉద్యోగి మూడేళ్ల క్రితం ఎప్పటికీ అతుక్కుని ఉండే కృత్రిమ దంతాలను అమర్చుకున్నారు. నిద్రలో ఉన్న సమయంలో దంతాల సెట్ ఊడిపోగా, దాన్ని మింగేయడంతో నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి, కుడి వైపు మధ్యభాగంలో ఇరుక్కుంది. అయితే ఎడమ ఊపిరితిత్తి పూర్తిగా పనిచేయడంతో శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తనప్పటికీ, బాగా దగ్గు రావడంతో కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిని సంప్రదించాడు. ఎక్స్‌రే, సీటీ స్కాన్ చేసి , కుడివైపు ఊపిరితిత్తిలో పళ్ల సెట్ ఉందని గుర్తించిన వైద్యులు, ఆయనకు జనరల్ ఎనస్థీషియా ఇచ్చి, రిజిడ్ బ్రాంకోస్కోపీ అనే పరికరం సాయంతో అత్యంత జాగ్రత్తగా బయటకు తీశారు. దంతాలసెట్‌కు రెండువైపులా లోహపు వస్తువులు ఉండడంతో వాటివల్ల ఊపిరితిత్తులకు గానీ, శ్వాసనాళానికి గానీ గాయం కాకుండా జాగ్రత్తగా తీసినట్లు డాక్టర్ భరత్ వెల్లడించారు.

పళ్ల సెట్ కట్టించుకునేవారు ఎప్పటికప్పుడు దంతవైద్యులను సంప్రదిస్తూ దాన్ని చూపించుకోఎలని, ఇలా నిద్రలో మింగేయడం లోపల ఎక్కువకాలం ఉండిపోతే దానిచుట్టూ కండ పెరిగిపోయి, ఇన్ఫెక్షన్ పెరిగే ప్రమాదముందని డాక్టర్ భరత్ వెల్లడించారు.

విద్యుత్ ఛార్జీల భారంపై నిరసన వెల్లువ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్మార్ట్‌మీటర్ల బిగింపు, ట్రూఅప్ పేరుతో విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రెడ్డి కంచరపాలెంలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం కంచరపాలెం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై ధరాభారం ఎక్కువైందన్నారు. నిత్యావసరాల ధరలు, పన్నుల భారాలతో సతమతమవుతున్న ప్రజలకు విద్యుత్ ఛార్జీలను పెంచి కోలుకోనీయకుండా చేయడం దుర్మార్గమన్నారు. అదానీకి కోట్లలో లాభాలను చేకూర్చే స్మార్ట్‌మీటర్ల బిగింపును ఆపాలని, ట్రూఅప్, సర్దుబాటు, ఇంధన డ్యూటీ పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే సిపిఎం నేతృత్వంలో రాష్ట్రంలో మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జోన్ నాయకులు ఓ. విజయ, కె.కొండమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.


కంచరపాలెంల్లో సిపిఎం ఆధ్వర్యాన కరెంటు బిల్లుల దహనం

పెందుర్తి :విద్యుత్ చార్జీల భారం, స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి 97వ వార్డు వీరానగర్‌లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు.ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపైరూ. 18 వేల కోట్లు విద్యుత్ ఛార్జీల భారం వేయడం దుర్మార్గమన్నారు. స్మార్ట్‌మీటర్లతో వినియోగదారుల ప్రయోజనాల కన్నా, అదానికి మేలు చేకూర్చేలా వ్యవహరించం సరికాదని, ప్రభుత్వ నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు సింహాచలం అప్పారావు, శ్రీను, ఆనంద్ కాలనీవాసులు పాల్గొన్నారు.

గాజువాక : పెంచిన కరెంట్ బిల్లులు రద్దు చేయాలని కోరుతూ, ఆదివారం అక్కిరెడ్డిపాలెంలో సిపిఎం ఆధ్వర్యంలో కరెంట్ బిల్లులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, విద్యుత్‌ఛార్జీలను పెంచబోమని ఎన్నికలకు ముందు హామీనిచ్చిన సిఎం చంద్రబాబు మాట తప్పి ప్రజలను మోసగించారన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్ల బిగింపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జోన్ నాయకులు ఏ నూకేశ్వరావు జై కోటేశ్వరరావు బి సుబ్బన్న పాల్గొన్నారు..

సిఐటియులో చేరిక



సిఐటియులో చేరిన రాంప్రసాద్‌తో స్థానిక యూనియన్ నేతలు

ప్రజాశక్తి-సీలేరు : మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం పరిధి జోలాపుట్ సివిల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఏపీ జెన్కో రెగ్యులర్ ఉద్యోగి బివి.రాంప్రసాద్ (జగన్) ఆదివారం సిఐటియులో చేరారు. ఈ మేరకు జికె.వీధి సీలేరులోని సిఐటియు బ్రాంచ్ కార్యాలయంలో రాంప్రసాద్ సిఐటియు సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు గౌరవ అధ్యక్షులు ఎస్ కె. సుభాన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సిఐటియు) అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణ్, విష్ణుకుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పట్ల యూనియన్ రాష్ట్ర స్థాయి నాయకులు బ్రాంచ్ యూనియన్ నాయకులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. స్థానిక సిఐటియు యూనియన్‌ను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు, రెగ్యులర్ ఉద్యోగులు సిఐటియులో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి. లక్ష్మణరావు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో సుమారు 400 మందికి వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞాయానంద్ తెలిపారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు జివి రామారావు, కస్తూరి సుబ్రహ్మణ్యం, రాయుడు శ్రీనివాస్, ఎస్ సంపత్ కుమార్, జిఎస్ఎల్ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కో-ఆర్డినేటర్ కే శ్రీనివాస్, వాలంటీర్లు భగీరథ రాజు, చంద్రశేఖర్, మంగిరెడ్డి, రామకృష్ణ, సంజీవ్, చంద్రశేఖర్, మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

17న జాబ్‌మేళా

ప్రజాశక్తి -భీమునిపట్నం : జిల్లా నైపుణ్యాభివృద్ధి. శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 17న మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి చాముండేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేధా సర్వో డ్రైవ్, క్లోవ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, ఆస్ట్రా మోటార్స్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలలో పాల్గొని, ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేస్తారన్నారు. ఐటిఐ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, అలాగే ఇసిఇ, ట్రిపుల్‌ఇ, ఇఐఇబి డిప్లొమా, బిటెక్, బి ఫార్మసీ, డి ఫార్మసీ, ఎంఫార్మసీ, ఎస్ఎస్‌సి, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన యువకులు సంబంధిత ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖ, హైదరాబాద్, కాకినాడలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు నైపుణ్యం. ఎపి. జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ నంబర్, ఆధార్ అనుసంధానం గల మొబైల్ నెంబర్‌తో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ

ప్రజాశక్తి -తగరపువలస : సింహాచలం వరహాలక్ష్మీ నరసింహస్వామి శాశ్వత అన్నదాన పథక నిర్వహణకు తమ వంతుగా తగరపువలస, చిట్టివలసకు చెందిన కెజిఎన్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాళ్ల శ్రీనివాస్ ఆదివారం రూ లక్ష విరాళం అందించారు. చిట్టివలస నాగవంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కాళ్ళ గురునాయుడు ద్వితీయ వర్ధంతి సందర్భంగా విరాళం అందజేశారు